# కరెంట్ అఫైర్స్

## శక్తిమంత మహిళలు 2018

- ఫోర్బ్స్ మ్యాగజైన్ రూపొందించిన '100 మంది అత్యంత శక్తిమంత మహిళల జాబితా - 2018'లో మన దేశానికి చెందిన నలుగురు మహిళలకు చోటు దక్కింది.
- హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ సీఈఓ రోష్నీ నాడార్ మల్హోత్రా జాబితాలో 51వ స్థానంలో నిలిచారు. బయోకాన్ వ్యవస్థాపకురాలు, ఛైర్‌పర్సన్ కిరణ్ మజుందార్ షా (60వ స్థానం), హెచ్‌టీ మీడియా ఛైర్‌పర్సన్, మేనేజింగ్ డైరెక్టర్ శోభనా భర్తియా (88వ స్థానం), బాలీవుడ్ నటి ప్రియాంక చోప్రా (94వ స్థానం) ఈ జాబితాలో ఉన్నారు.
- జర్మనీకి 4వ సారి ఛాన్సెలర్‌గా పనిచేస్తున్న ఏంజెలా మెర్కెల్ అగ్రస్థానంలో నిలిచారు. ఈమె ఈ జాబితాలో అగ్రస్థానంలో నిలవడం ఇది వరుసగా 8వ సారి. బ్రిటన్ ప్రధానమంత్రి థెరీసా మే రెండో స్థానంలో నిలవగా, అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ (ఐఎంఎఫ్) మేనేజింగ్ డైరెక్టర్ క్రిస్టైన్ లగార్డేకు మూడోస్థానం, జనరల్ మోటార్స్ సీఈఓ మేరీ బర్రాకు 4వ స్థానం, ఫిడెలిటీ ఇన్వెస్ట్‌మెంట్స్ సీఈఓ అబిగైల్ జాన్సన్‌కు 5వ స్థానం లభించాయి.

## ఆర్‌బీఐ పరపతి విధాన సమీక్ష

- ఆర్‌బీఐ గవర్నర్ ఉర్జిత్ పటేల్ అధ్యక్షతన ఆరుగురు సభ్యుల మానిటరీ పాలసీ కమిటీ (ఎంపీసీ) 2018, డిసెంబరు 5న 2018-19 ఐదో ద్వైమాసిక పరపతి విధాన సమీక్ష నిర్ణయాలను ప్రకటించింది.
- బ్యాంకులకు వర్తించే స్వల్పకాలిక వడ్డీ (రెపో) రేటు 6.5 శాతంగా, రివర్స్ రెపో 6.25 శాతంగా, బ్యాంకుల నగదు నిల్వల నిష్పత్తి (సీఆర్ఆర్) 4 శాతంగా, బ్యాంక్ రేటు 6.75 శాతంగా యథాతథంగా కొనసాగిస్తున్నట్లు వెల్లడించింది.
- ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2018-19) వృద్ధి రేటు అంచనాను 7.4 శాతంగానే కొనసాగిస్తున్నట్లు ఆర్‌బీఐ వెల్లడించింది.
- బ్యాంకుల రిటైల్, ఎంఎస్ఎంఈ రుణాల వడ్డీ రేట్లలో పారదర్శకత పెంచేందుకు ఆర్‌బీఐ కీలక నిర్ణయం తీసుకుంది. వ్యక్తిగత, గృహ, వాహన రుణాలతోపాటు సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ)కిచ్చే రుణాలపై ఫ్లోటింగ్ వడ్డీరేట్లను ప్రామాణిక రేట్లతో అనుసంధానం చేయనున్నారు. వచ్చే ఏడాది ఏప్రిల్ 1 నుంచి ఈ విధానం అమల్లోకి రానుంది.

## జీశాట్-11 ప్రయోగం

- భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) చరిత్రలోనే అత్యంత భారీ ఉపగ్రహమైన జీశాట్-11ను 2018 డిసెంబరు 5న ఫ్రెంచ్ గయానాలోని కౌరు అంతరిక్ష కేంద్రం నుంచి ఏరియన్ స్పేస్ సంస్థకు చెందిన ఏరియన్-5 (వీఏ 246) ఉపగ్రహ వాహక నౌక ద్వారా విజయవంతంగా నిర్ణీత కక్ష్యలోకి చేర్చారు.
- 5,854 కిలోల బరువున్న జీశాట్-11, ఇప్పటివరకు ఇస్రో తయారుచేసిన అన్ని ఉపగ్రహాల్లోకెల్లా అత్యంత బరువైంది. అందుకే దీన్ని 'బిగ్ బర్డ్' (పెద్ద పక్షి) అని పిలుస్తున్నారు. ఇస్రోకు చెందిన అత్యంత శక్తిమంతమైన రాకెట్ జీఎస్ఎల్వీ మార్క్-3కి కేవలం నాలుగు టన్నుల బరువున్న ఉపగ్రహాలను మాత్రమే మోసుకెళ్లే సామర్థ్యం ఉంది. జీశాట్ - 11 బరువు 5 టన్నులకు పైగా ఉండటం వల్ల విదేశీ వాహక నౌకపై ఇస్రో ఆధారపడింది.
- ఇస్రో రూపొందించిన జీశాట్-11 అత్యంత బరువైన, అధునాతన హై త్రోపుట్ కమ్యూనికేషన్ ఉపగ్రహం (హెచ్‌టీఎస్). అభివృద్ధి చెందిన దేశాల్లో ఈ హెచ్‌టీఎస్‌లు ఇంటర్నెట్ తీరుతెన్నులను మార్చేశాయి. భారత్ కూడా 'డిజిటల్ ఇండియా' కార్యక్రమం కింద దేశవ్యాప్తంగా సెకనుకు 100 గిగాబైట్ల (జీబీపీఎస్) వేగాన్ని అందించేందుకు నాలుగు హెచ్‌టీఎస్ ఉపగ్రహాల రూపకల్పనకు శ్రీకారం చుట్టింది. వాటిలోని జీశాట్-19ను గతేడాది జూన్ 5న జీఎస్ఎల్వీ-మార్క్ 3-డీ1 ద్వారా, జీశాట్-29ను ఈ ఏడాది నవంబరు 14న జీఎస్ఎల్వీ-మార్క్ 3-డీ2 ద్వారా ఇప్పటికే కక్ష్యలోకి చేర్చగా, జీశాట్-11ను తాజాగా ప్రయోగించారు. నాలుగోదైన జీశాట్-20 వచ్చే ఏడాది ప్రయోగిస్తారు.
- జీశాట్-11 సెకనుకు 16 గిగాబైట్ల (జీబీపీఎస్) వేగాన్ని అందించగలదు. ఈ ఉపగ్రహం భారత భూభాగంతోపాటు చుట్టుపక్కల ఉన్న దీవుల్లోని వినియోగదారులకు హైడేటా ఇంటర్నెట్ సేవలను అందిస్తుంది.



www.eenadupratibha.net

- జీశాట్-11 ఇస్రో రూపొందించిన 34వ కమ్యూనికేషన్ ఉపగ్రహం. ఇందులో 32 కేయూ బ్రాండ్, 8 కేఏ బ్రాండ్, ట్రాన్స్‌పాండర్లు ఉన్నాయి. జీవిత కాలం 15 ఏళ్లు. ప్రయోగ ఖర్చుతో కలిపి దీని వ్యయం రూ. 1200 కోట్లు.
- జీశాట్-11తో పాటు దక్షిణ కొరియాకు చెందిన 3507 కిలోల జియో-కోంప్ శాట్-2ఏను కూడా ఏరియాన్-5 రాకెట్ తాజాగా కక్ష్యలోకి ప్రవేశపెట్టింది.

## ప్రధాని అర్జెంటీనా పర్యటన

- ప్రధాని నరేంద్ర మోదీ 2018, నవంబరు 29 నుంచి మూడు రోజుల పాటు అర్జెంటీనాలో పర్యటించారు. నవంబరు 30, డిసెంబరు 1 తేదీల్లో రెండు రోజులపాటు అర్జెంటీనా రాజధాని బ్యూనస్ ఎయిర్స్‌లో జరిగిన 13వ జీ-20 సదస్సులో పాల్గొన్నారు.
- నవంబరు 30న అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్, జపాన్ ప్రధాని షింజో అబేలతో మోదీ బ్యూనస్ ఎయిర్స్‌లో తొలిసారిగా జరిగిన త్రైపాక్షిక భేటీతో నవ శకానికి నాంది పలికారు. ప్రపంచ శాంతి కోసం 'జై' (జపాన్, అమెరికా, ఇండియా) కలిసి పనిచేస్తుందని మోదీ పేర్కొన్నారు. 'శాంతి కోసం యోగా' అనే సంస్థ ఏర్పాటు చేసిన కార్యక్రమంలోనూ మోదీ పాల్గొన్నారు.
- డిసెంబరు 1న ప్రధాని మోదీ జీ-20 సదస్సులో ప్రసంగించారు. ఆర్థిక నేరాలకు పాల్పడిన వారి విషయంలో చర్యలపై 9 అంశాల అజెండాను ఈ సందర్భంగా మోదీ జీ-20 దేశాల ముందుకు తీసుకువచ్చారు.
- భారత్ 2022లో జీ-20 సదస్సుకు ఆతిథ్యాన్ని ఇవ్వాలని నిర్ణయించింది. దేశం 75వ స్వాతంత్ర్య సంబరాన్ని జరుపుకోనున్న నేపథ్యంలో ఆ ఏడాది భారత్‌లో సదస్సు నిర్వహణకు సభ్యదేశాలు అంగీకరించాయి.
- పన్నెండేళ్ల విరామానంతరం భారత్, రష్యా, చైనాలు బ్యూనస్‌ఎయిర్స్‌లో త్రైపాక్షిక భేటీ నిర్వహించాయి.
- బహుళ పాక్షిక వాణిజ్య వ్యవస్థకు జీ-20 దేశాలు మద్దతు పలికాయి. అంతర్జాతీయ వాణిజ్యాన్ని పర్యవేక్షించే ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీవో)లో సంస్కరణలు తీసుకురావాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఉగ్రవాదానికి కళ్లెం వేయడంలో హాంబర్గ్ నేతల ప్రకటనకు కట్టుబడి ఉంటామని పేర్కొన్నారు. పారిస్‌లో కుదిరిన వాతావరణ మార్పుల ఒప్పందాన్ని అమలు చేయడానికి అమెరికా మినహా మిగిలిన 19 దేశాలు అంగీకరించాయి.

## ఫోర్బ్స్‌లో భారత సెలబ్రిటీలు

- ఈ ఏడాది ఎక్కువగా ఆర్జించిన 100 మంది భారత సెలబ్రిటీల జాబితాను 2018, డిసెంబరు 5న ఫోర్బ్స్ మ్యాగజైన్ విడుదల చేసింది. 2017, అక్టోబరు 1 నుంచి 2018, సెప్టెంబరు 30 వరకూ దేశంలోనే అత్యధికంగా ఆర్జించిన 100 మంది ప్రముఖులతో రూపొందించిన ఈ జాబితాలో సల్మాన్‌ఖాన్ (రూ. 253.25 కోట్ల ఆదాయం) అగ్రస్థానంలో నిలిచారు. ఈ జాబితాలో అగ్రస్థానంలో నిలవడం సల్మాన్‌కు ఇది వరుసగా మూడోసారి.
- టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లీ ఈ జాబితాలో రెండో స్థానంలో నిలిచాడు. కోహ్లీ రూ. 228.09 కోట్లు ఆర్జించాడు. అక్షయ్ కుమార్ (రూ. 185 కోట్లు), దీపికా పదుకొణె (రూ. 112.8 కోట్లు), మహేంద్రసింగ్ ధోనీ (రూ. 101.77 కోట్లు) వరుసగా 3, 4, 5 స్థానాల్లో నిలిచారు.
- 6 నుంచి 10 స్థానాల్లో వరుసగా అమీర్‌ఖాన్ (రూ. 97.5 కోట్లు), అమితాబ్ బచ్చన్ (రూ. 96.17 కోట్లు), రణ్‌వీర్‌సింగ్ (రూ. 84.67 కోట్లు), సచిన్ తెందూల్కర్ (రూ. 80 కోట్లు), అజయ్ దేవ్‌గన్ (రూ. 74.5 కోట్లు) నిలిచారు.

## పోలండ్ వాతావరణ సదస్సు

- పారిస్ వాతావరణ మార్పుల ఒప్పందాన్ని అమల్లోకి తీసుకువచ్చే లక్ష్యంతో 2018, డిసెంబరు 3 నుంచి 14 వరకు పోలండ్‌లోని కేటోవైస్ నగరం వేదికగా వాతావరణ సదస్సును నిర్వహిస్తారు.
- 'Cop 24- కేటోవైస్ 2018- యునైటెడ్ క్లైమేట్ ఛేంజ్ కాన్ఫరెన్స్' పేరిట దీన్ని నిర్వహిస్తున్నారు. ముంచుకొస్తున్న వాతావరణ ముప్పును ఎదుర్కొనేందుకు కార్యాచరణను రూపొందించడమే ఈ సదస్సు ధ్యేయం.
- స్వీడన్‌కు చెందిన 15 ఏళ్ల బాలిక గ్రెటా థన్‌బెర్గ్ డిసెంబరు 3న ఈ సదస్సులో పాల్గొని ప్రసంగించింది. 'ఆటిజం'తో బాధపడుతున్న ఈ బాలిక నేతృత్వంలో స్వీడన్‌లో పర్యావరణ పరిరక్షణ ఉద్యమం కొనసాగుతోంది.

**ఈ వారం విశేషాలు**

- ప్రపంచ వ్యవసాయ ఎగుమతుల్లో భారత్ వాటాను రెట్టింపు చేయాలని, విదేశీ మార్కెట్లలో ఎగుమతి అవకాశాల ద్వారా రైతులు ప్రయోజనాలు పొందేలా చేయాలనే లక్ష్యాలతో రూపొందించిన 'వ్యవసాయ ఎగుమతి విధానం - 2018'కి కేంద్ర మంత్రివర్గం 2018, డిసెంబరు 6న ఆమోదం తెలిపింది. వ్యవసాయ ఎగుమతులు ప్రస్తుతం రూ. 2.12 లక్షల కోట్లు ఉండగా, 2022 నాటికి సుమారు రూ. 4.25 లక్షల కోట్లకు పెంచాలనే లక్ష్యంతో దీన్ని రూపొందించారు.
- ప్రముఖ రచయిత కొలకలూరి ఇనాక్ రచించిన 'విమర్శిని' వ్యాస సంపుటికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించింది.
- లండన్ కేంద్రంగా పనిచేస్తున్న 'ఈస్టర్న్ ఐ' వారపత్రిక రూపొందించిన ఆసియాలో అత్యంత ఆకర్షణీయమైన 50 మంది మహిళల జాబితాలో ప్రముఖ బాలీవుడ్ నటి దీపికా పదుకొణె అగ్రస్థానంలో నిలిచారు.
- చనిపోయిన మహిళా దాత నుంచి స్వీకరించిన గర్భాశయం ద్వారా ఓ బ్రెజిలియన్ మహిళ పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చారు. ఈ విధంగా ఓ బిడ్డకు విజయవంతంగా జన్మనివ్వడం ప్రపంచంలో ఇదే తొలిసారి. బ్రెజిల్‌లోని సావోపాలో విశ్వవిద్యాలయానికి చెందిన డేవీ ఎజెన్‌బర్గ్ నేతృత్వంలోని పరిశోధకుల బృందం ఈ ఘనత సాధించింది.
- రష్యాకు చెందిన ఒలెగ్ కెనోనెన్కో, అమెరికాకు చెందిన అన్నె మెక్ క్లెయిన్, కెనడాకు చెందిన డేవిడ్ సెయింట్ జాక్వెస్ అనే ముగ్గురు వ్యోమగాములు సోయుజ్ వ్యోమనౌక ద్వారా 2018, డిసెంబరు 4న అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి (ఐఎస్ఎస్) విజయవంతంగా చేరుకున్నారు.
- 'హైయెస్ట్ పెయిడ్ యూట్యూబ్ స్టార్స్ 2018' జాబితాలో అమెరికాకు చెందిన ఏడేళ్ల బాలుడు రేయాన్ అగ్రస్థానంలో నిలిచాడు. యూట్యూబ్‌లో 'రేయాన్ టాయ్స్ రివ్యూ' పేరుతో వీడియోలను అప్‌లోడ్ చేసే ఆ బుడతడు రూ. 155 కోట్ల సంపాదనతో అగ్రస్థానంలో నిలిచాడు.
- వచ్చే ఏడాది జనవరిలో పెట్రోలియం ఎగుమతి దేశాల సంఘం (ఒపెక్) నుంచి వైదొలగనున్నట్లు అరబ్ దేశం ఖతార్ ప్రకటించింది.
- భారత్ 23వ ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ)గా సునీల్ అరోరా 2018, డిసెంబరు 2న బాధ్యతలు స్వీకరించారు. ఈయన 2021, ఏప్రిల్ 12 వరకు పదవిలో కొనసాగుతారు.
- అమెరికా మాజీ అధ్యక్షుడు జార్జ్ హెర్బర్ట్ వాకర్ బుష్ (94) 2018, డిసెంబరు 1న హ్యూస్టన్‌లో మరణించారు. ఈయన 1989 నుంచి 1993 వరకు అమెరికా 41వ అధ్యక్షుడిగా వ్యవహరించారు.

**రచయిత: సీహెచ్ కృష్ణప్రసాద్**

www.eenadupratibha.net